# కాంగ్రెస్ మాయలో పడి ఆగం కావద్దు

- ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకోవడమే..
- 24 గంటల కరెంట్ కావాలా.. మూడు గంటల కరెంట్ కావాలో ప్రజలు తేల్చుకోవాలి
- సంక్షేమానికి చిరునామా ముఖ్యమంత్రి కేసీఆర్
- బీబీనగర్ వరకు విస్తరించనున్న మెట్రో ట్రైన్
- చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



వెంకిర్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్, నవంబర్ 17 : కాంగ్రెస్ మాయలో పడి ప్రజలు ఆగం కావొద్దని, ఆ పార్టీకి ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకోవడమేనని బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మక్తానంతారం, వెంకిర్యాల, పడమటిసోమారం, పల్లెగూడెం, మాధారం, రావిపహాడ్, రావిపహాడ్‌తండా, మగ్దుంపల్లి, గొల్లగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలు కరెంటిచ్చే బీఆర్ఎస్ కావాలా, 3 గంటలు చాలు అంటున్న కాంగ్రెస్ కావాలో రైతులే తేల్చుకోవాలన్నారు. సమైక్య రాష్ట్రంలో కరెంట్, సాగు, తాగునీటి కోసం అరిగోస పడ్డామని గుర్తు చేశారు. బీబీనగర్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుందని, స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయని తెలిపారు. బీబీనగర్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించనుందని, మెట్రో వస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. భువనగిరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వెంకిర్యాల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 40 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోలి ప్రణితాపింగళ్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, సర్పంచులు పసులాది లావణ్య, అరిగె సుదర్శన్, తలబోయిన గణేశ్‌యాదవ్, సప్పిడి భారతమ్మ, బానోతు మహేశ్, మందడి అలివేలు రాంరెడ్డి, ఆవుర్ల పద్మాశ్రీశైలం, గుండెబోయిన రమేశ్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, గ్రామశాఖ అధ్యక్షులు రాములు, బలవంత్‌రెడ్డి, బాలరాజు, మాధవరెడ్డి, శంకరయ్య, గణేశ్, నాయకులు నరేందర్‌రెడ్డి, రమేశ్, లక్ష్మీనారాయణ, పార్టీ మండల మహిళాధ్యక్షురాలు పిట్టల శ్యామల పాల్గొన్నారు.



వెంకిర్యాలలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు



కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

## సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డిని గెలిపిస్తాయి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 17 : ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ ప్రధాన రహదారిలో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే ఎమ్మెల్యే పైళ్ల చేసిన కృషి వల్లనేనన్నారు. మరింత అభివృద్ధి చెందాలంటే పైళ్ల శేఖర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, నాయకుడు పంగరెక్క స్వామి పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని ఎం.తుర్కపల్లిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనితారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పహిల్వాన్‌పూర్‌లో ఎలిమినేటి జంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, గుండు శేఖర్‌రెడ్డి, ఎడ్ల నిరంజన్‌రెడ్డి, బట్టు దాసురావు, బెల్లి నర్సింహ, లింగయ్య పాల్గొన్నారు.



వలిగొండ : ఎం.తుర్కపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సతీమణి వనితారెడ్డి



భూదాన్‌పోచంపల్లి : గోసుకొండలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కుమార్తె మన్వితారెడ్డి



భువనగిరి సిటీ : పట్టణంలోని 8వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ స్వామి

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వలిగొండ, నవంబర్ 17 : మండలంలోని అరూరు, వెల్వర్తి, పులిగిల్లలో మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో, వలిగొండ సబ్‌స్టేషన్ పరిధిలోని సుంకిశాల, లోతుకుంటలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మచ్చేందర్ శుక్రవారం ఒక ప్రకటణలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఎంపికైన విద్యార్థులు

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పోచంపల్లి విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 17 : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అక్షయ, ఐశ్వర్య రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో గద్వాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



భూదాన్‌పోచంపల్లి : ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 17 : మండలంలోని ఇంద్రియాల, ముక్రికుంటతండా, రామలింగంపల్లి, పోచంపల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 150 మంది శుక్రవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ధరావత్ వెంకటేశ్‌తో పాటు 150 మంది కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాటి సుధాకర్‌రెడ్డి, చిలువేరు బాలనరసింహ, రైతు బంధు సమితి మండల కన్వీనర్ రావుల శేఖర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మొగిలిపాక యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు యాదగిరి నాయకులు పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వెల్వర్తికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉక్కుర్తి యాదయ్య, కంచర్ల మధుసూధన్‌రెడ్డి, మల్లం లక్ష్మయ్య, ఉక్కుర్తి శ్రీనుతో మరికొంత మంది ఉన్నారు. అదేవిధంగా మండలంలోని గోకారం గ్రామానికి చెందిన 15 మంది బుడిగె మహేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ పసల అన్నామేరి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కల్కూరి రాములు, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, ముద్దసాని కిరణ్‌రెడ్డి, నారి అభిషేక్, పురుషోత్తం, నల్లగంటి లింగస్వామి, కానుగ నరేశ్, కనికారపు రాము, కందారపు సురేశ్, నారి సాయికుమార్ పాల్గొన్నారు.

## కార్తీక వన భోజనాలు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 17 : మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రం-1 ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దంతూరి భాగ్యమ్మచ బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## 150 కిలోల గంజాయి పట్టివేత

బీబీనగర్, నవంబర్ 17 : అక్రమంగా రవాణా చేస్తున్న 150 కిలోల గంజాయిని బీబీనగర్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడూరు టోల్ ప్లాజా వద్ద ఎలక్షన్ కోడ్ సందర్భంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. నిజామాబాజ్ జిల్లా మానేపల్లికి చెందిన మహమ్మద్ మహబూబ్(30) కారులో హైదరాబాద్ వైపు వెళ్తుండగా పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. కారులోని 150 కిలో గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రఘువీర్ రాయ్, సాగర్ పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.